

# కథా కౌముది

## ఒక్కడు చాలు! - ఆకునూరి మురళీకృష్ణ

ఎప్పుడూ సందడిగా ఉండే తిరుపతి వెంకటేశ్వరస్వామి కొండలాగ ఆ హాస్పిటల్ కూడా పగలూ రాత్రి అన్న తేడా లేకుండా జనంతో కిటకిటలాడుతూ ఉంటుంది. వచ్చేది రోగులూ, వాళ్ళకి సంబంధించిన మనుషులే, అయినా రోగాల తాలూకు 'సిక్‌నెస్' ఎక్కడా కనబడకుండా చూడ్డానికి ఫైవ్ స్టార్ హోటల్లా ఉంటుంది. అలా మెయిన్‌టైన్ చేయడానికి ఆ హాస్పటల్ యాజమాన్యం చాలా కృషి చేస్తుంది. 'మా హాస్పటల్లో అడుగుపెడితే చాలు... మీ జబ్బు గురించి మీరే మర్చిపోతారు' అన్న స్లోగన్స్‌తో తమ హాస్పటల్ గురించి పబ్లిసిటీ కూడా ఇచ్చుకుంటారు.

చూసుకుని నడవకపోతే జారిపడిపోయే ప్రమాదముందన్నంత నున్నగా ఉన్న మార్బుల్ ఫ్లోరింగ్ మీద చకచకా నడుస్తూ తన గదిలోకి అడుగు పెట్టాడు డాక్టర్ ప్రకాష్.

"వన్నాట్ ఫోర్‌లో పేషెంట్‌కి ఆపరేషన్ అయ్యిందా?" లోనికి అడుగుపెడుతూనే అడిగాడు అతడు అటెండర్ యాదగిరిని.

"లేదయ్యా" అన్నాడు యాదగిరి ప్రకాష్ అడిగినదానికి సమాధానంగా.

ప్రకాష్ ఒక్క క్షణం ఆశ్చర్యపోయినట్టు అతడివంక చూసాడు.

క్రితంరోజు తనకి వీక్లీ ఆఫ్ కావడంతో ప్రకాష్ హాస్పటల్‌కి రాలేదు. ఆ రోజే డ్యూటీలో జాయినయ్యాడు.

"ఎందుకు చేయలేదు?" కుర్చీలో కూర్చుని స్టెతస్కోప్ ఎదురుగా ఉన్న గ్లాస్ టేబుల్ మీద పెడుతూ అడిగాడు ఆశ్చర్యంగా.

కంజెనిటల్ హార్ట్ డిసీజ్... చాలా అరుదుగా చిన్నపిల్లల్లో వచ్చే వ్యాధి. ఆడుకుంటూ ఆడుకుంటున్న పిల్లాడు హఠాత్తుగా గుండెలో నొప్పి అని పడిపోతే రెండు రోజుల క్రితం హుటాహుటిన హాస్పటల్‌కి తీసుకు వచ్చారు తల్లిదండ్రులు. ఇక్కడ టెస్టులన్నీ చేసి డయాగ్నిసిస్ చేసారు. మర్నాడే సర్జరీ చేయాలని నిర్ణయించారు.

"తెలియదయ్యా" అన్నాడు అతడు టేబుల్ మీద కేస్‌షీటున్న ఫైళ్ళని సరిగ్గా సర్దుతూ.

అప్పటికే ఏసీ ఆన్ చేసి ఉండడం వల్ల గదంతా చల్లగా ఉంది. యాదగిరి గాజుగ్లాసులో మినరల్ వాటర్ నింపి తీసుకుని వచ్చి టేబుల్ మీద పెట్టి మూత పెట్టాడు. టేబుల్ మీద మూలగా అమర్చిన ఫ్లవర్ వాజ్‌లోని తాజా పూలు ఏసీ మిషన్‌లోంచి వచ్చే గాలికి నిశ్శబ్దంగా కదులుతున్నాయి.

"ఎందుకు చేయలేదు? బాబు కులాసాగానే ఉన్నాడు కదా?" సాలోచనగా చూస్తూ అడిగాడు. అతని స్వరంలో ధ్వనించిన ఆదుర్దాని గమనించి నవ్వాడు నలభై ఏళ్ళ ఆ అటెండర్.

"బాబు బాగానే ఉన్నాడయ్యా.... నవ్వుతూ ఆడుకుంటున్నాడు. ఆపరేషన్ ఎందుకు చేయలేదో నాకు తెలియదు. కాఫీ తీసుకురమ్మంటారా?" అని అడిగాడు.

అతడి మాటలకి ప్రకాష్‌కి కూడా నవ్వు వచ్చింది. ఆపరేషన్ చేయకపోవడానికి లక్ష కారణాలుండొచ్చు. అవన్నీ అతడికెలా తెలుస్తాయి? తన పిచ్చి కానీ. సీనియర్ సర్జన్ వేణుగోపాల్‌తో ఇంటర్‌కంలో మాట్లాడదామనుకున్నాడు. మళ్ళీ వాచీ చూసుకుని ఆ ప్రయత్నాన్ని విరమించుకుని తన ముందున్న ఫైళ్ళని చూస్తూ చెప్పాడు యాదగిరితో.

"కాఫీ వద్దు, పేషెంట్‌లని రమ్మను"

వాళ్ళు జాయినైన రోజు తనే ఉన్నాడు డ్యూటీలో. ఆ కుర్రాడి పేరు వంశీ. చామనఛాయ రంగులో బొద్దుగా ఉన్నాడు. ఒక్కడే పిల్లాడు కావడంతో ప్రాణాలన్నీ వాడిమీదే పెట్టుకుని బ్రతికేస్తున్నారు ఆ దంపతులిద్దరూ. ఆరోజు ఎందుకో వాళ్ళని చూస్తే తన తల్లి, తండ్రి గుర్తుకు వచ్చారు ప్రకాష్‌కి.

పిల్లవాడికి వచ్చిన జబ్బు గురించి తెలుసుకుని అల్లాడిపోతుంటే భయపడాల్సిందేమీ లేదని సర్జరీ చేసి నయం చేయవచ్చనీ అది కూడా ఎంతో సులభమైన సర్జరీనే అని డాక్టరుగా వాళ్ళకి చెప్పి ఓదార్చాడు.

తమ కన్నీళ్ళు పిల్లాడి కంట్లో పడకుండా వాళ్ళు చేసే ప్రయత్నాలు చూస్తుంటే బాధేసింది అతడికి. ఇంటికి వెళ్ళినా వంశీనే గుర్తుకు రాసాగాడు. అందుకే రాగానే అతడిని గురించి ఎంక్వయిరీ చేసాడు.

పన్నెండవుతుంటే సీనియర్ సర్జన్ వేణుగోపాల్ ఫోన్ చేసాడు. సాయంత్రం ట్రిపుల్ హార్ట్ వాల్వ్ సర్జరీ ఉంది, దానికి సంబంధించిన విషయాలు చెప్పడానికి చేసాడు. " ఓపీ అయిపోగానే ఒకసారి వస్తే రిపోర్టులు చూసి పొజిషన్ డిస్కస్ చేద్దాం" అన్నాడు.

"అది సరే, చిల్డ్రన్ వార్డ్‌లో వన్నాట్ ఫోర్ రూంలో జాయినైన వంశీ అన్న బాబుకి నిన్న ఓపెన్ హార్ట్ సర్జరీ అనుకున్నాం కదా ఎందుకు చేయలేదు? ఏమిటి ప్రోబ్లం? ఎనీ అదర్ కాంప్లిక్షేషన్స్?" ఫోన్ పెట్టేసే ముందు అడిగాడు ప్రకాష్

"నో అదర్ కాంప్లికేషన్స్. ఎవ్రీ థింగ్ ఈజ్ ఓకే.. బట్..." అంటూ ఇబ్బందిగా ఆగాడు వేణుగోపాల్.

"మరి.. మరెందుకు చేయలేదు ఆపరేషన్? బ్లడ్ దొరకలేదా లేక అనస్థీషియన్ రాలేదా?"

"అదేమీ కాదు. వాళ్ళు సెక్యూరిటీ డిపాజిట్ కట్టలేదు" అన్నాడు వేణుగోపాల్.

ఉవ్వెత్తున ఎగిసిపడే కెరటం ఒకటి వచ్చి బలంగా తన ముఖాన్ని తాకినట్లుగా అనిపించింది ప్రకాష్‌కి.

"నిన్న ఏదో ఇబ్బంది వచ్చిందట వాళ్ళకి. ఈరోజు అడ్జస్ట్ చేసేస్తామన్నారు. డిపాజిట్ కట్టేయగానే ఆపరేషన్‌కి ఏర్పాటు చేయమన్నారు చీఫ్. అంతదాకా పిల్లాడిని అబ్జర్వేషన్లో ఉంచాం అన్నాడు వేణుగోపాల్

ప్రకాష్ ముఖం కోపంతో కందగడ్డలా మారింది."అబ్జర్వేషన్‌లో ఉంచారా? ఏం నీకు తెలియదా ఆ పిల్లాడి కండిషన్? బ్లడ్ ప్రెజర్ ఇప్పటికే డేంజరస్ లెవెల్లో ఉంది. రెస్పిరేటరీ ప్రోబ్లం ఎప్పటినుంచీ ఉంది. అసలిన్నాళ్ళూ ఆ పిల్లాడెలా బ్రతికున్నాడో ఆ భగవంతుడికే తెలియాలి. అలాంటి వాడిని ఇంకా అబ్జర్వేషన్లో ఉంచి చేస్తారు? ఒకవేళ పరిస్థితి ఇంతకన్నా విషమించినా కూడా ఏమీ చేయరు. వాళ్ళు సెక్యూరిటీ డిపాజిట్ కట్టేదాకా చూ....స్తూ... ఉండడం తప్ప" అన్నాడూ వ్యంగ్యంగా.

వేణుగోపాల్ మాట్లాడలేదు. అతడి ఆవేదనని అర్థం చేసుకుంటున్నట్లు కాసేపు మౌనంగా ఉండిపోయాడు.

"అలా ఎలా వదిలేయగలిగారు? ఆ పసివాడిని చూస్తే మీకు జాలి కలగడం లేదూ?" అన్నాడు ప్రకాష్

"నువ్వన్నది నిజమే. కానీ అంతకన్నా ఏం చేయగలం? ఈ హాస్పిటల్ మనది కాదు కదా, మనం ఇక్కడ ఎంప్లాయిస్ మాత్రమే! ఇక్కడి రూల్స్ ప్రకారం పనిచేయాలి. అనుకుంటాంకానీ మన జీవితాల్లో డబ్బు చాలా ప్రధానమైన పాత్రని పోషిస్తుంది. ఒకవేళ డబ్బు

సమకూరకపోతే బిల్లు కడతామని అతను పనిచేసే ఆఫీసు వాళ్ళదగ్గిరనుంచీ గ్యారంటీ సర్టిఫికెట్టేనా సరే తీసుకురమ్మని సలహా ఇచ్చాను. చూద్దాం. ఇవాళ ఏదో రకంగా సెటిలవుతుంది" అన్నాడు వేణుగోపాల్.

ఫోన్ పెట్టేసాక, అలా చేయడం ఆ కార్పోరేట్ హాస్పటల్ రూల్స్ కి వ్యతిరేకమని తెలిసినా సరే తనే చొరవ తీసుకుని అక్కౌంట్స్ సెక్షన్‌కి ఫోన్ చేసి వాళ్ళు డబ్బు కట్టారా అన్న విషయాన్ని వాకబు చేసాడు. జాయినైన రోజు కట్టిన డిపాజిట్ తప్ప మళ్ళీ ఏమీ కట్టలేదని, గ్యారంటీ లెటర్ కూడా సబ్మిట్ చేయలేదని సమాధానం చెప్పడంతో భారంగా నిట్టూర్చాడు.

"డాక్టరుకి చూపించేసుకున్నాం కదా ఇంక ఇంటికి వెళ్ళిపోదామమ్మా.. నాకిక్కడేం తోచడం లేదు" అన్నాడు వంశీ తల్లి మెడ చుట్టూ చేతులు వేస్తూ.

వాడిని ఎంగేజ్ చేయడం కోసం కామిక్ బుక్‌లోని కథలని చదివి వివరిస్తున్న కళ్యాణి తలెత్తి భావరహితంగా చూసింది వాడిని.

"డాక్టర్ అంకుల్ మనల్నిక్కడింకో రెండురోజులుండమన్నారమ్మా" అంది.

"ఎందుకు? నాకు కడుపులో నొప్పి అప్పుడే తగ్గిపోయింది కదా" అన్నాడు వంశీ.

నొప్పి కడుపులోనో గుండెలోనో కూడా చెప్పుకోలేని వాడి అమాయకత్వాన్ని చూస్తుంటే కళ్ళలోకి నీళ్ళొచ్చేసాయి కళ్యాణికి. చప్పున తల తిప్పుకుంది.

సరిగ్గా అదే సమయంలో అడుగుపెట్టాడక్కడికి ప్రకాష్. అతడికి వంశీని ఒకసారి చూడాలనిపించింది. చెకప్ కోసం వచ్చినట్టు అక్కడికి వచ్చాడు. రెండురోజుల క్రితం జాయినైన ఆ పిల్లాడిలో తననితాను ఐడింటిఫై చేసుకోవడం వల్లనో ఏమో అతనికి అతడితో ఏదో తెలియని అనుబంధం ఉన్నట్లనిపిస్తోంది. వైద్య వృత్తిలో ఉన్న వాళ్ళకి సాధారణంగా అలాంటి భావాలుండవని తన సీనియర్ కొలీగ్స్‌ని చూసి తెలుసుకున్నాడు. తన కొత్తగా వృత్తిలోకి రావడం వల్ల ఇంకా అలా అనిపిస్తోందేమో.... రాను రాను తను కూడా వాళ్ళలా తయారైపోతాడేమో అనుమానమే.

అతడిని చూడగానే ఆమె లేచి నిల్చుంది.

చేయడానికి ఏమీలేకపోయినా అతడు కేస్ షీట్‌నే మరో మారు పరిశీలించాడు. వంశీ గుండెల మీద స్టెతస్కోప్ ఉంచి చూసాడు. మందులు సరిగ్గా వేస్తున్నారా అని ఆమెని అడగాల్సిన పనిలేదు. తన హాస్పిటల్లో రోగులకి ఏ వేళకి ఏ మందులు వేయాలో నర్సులే స్వయంగా వచ్చి ఇచ్చి వెళతారు.

వంశీ తండ్రి ఉంటే ఆపరేషన్ ఎంత అత్యవసరమో మరోసారి చెప్పి సెక్యూరిటీ డిపాజిట్ గురించి హెచ్చరించి వెళదామని వచ్చాడు. కానీ అసలే దైన్యానికి మారుపేరులా కనిపిస్తున్న ఆమెతో ఆ విషయం ఎలా చెప్పగలడు?

అతడు బయటికి నడుస్తుంటే వంశీ చేతుల్లో కామిక్ బుక్ ఉంచి అతడి వెనకాలే ఆమె కూడా గబగబా బయటికి వచ్చింది. తలుపు దగ్గరగా వేసి అడిగింది ప్రకాష్‌ని. "ఎలాఉందండీ మా వాడికి?" అని.

గొంతుకేదో అడ్డుపడ్డట్టయింది ప్రకాష్‌కి.

"మీకు మొన్ననే చెప్పాను కదమ్మా... మీ బాబుకి ఆపరేషన్ ఎంత తొందరగా చేయిస్తే అంత మంచిది. మీరు సెక్యూరిటీ డిపాజిట్ కట్టనిదే ఇక్కడ ఆపరేషన్ చేయరు. కనీసం మీ వారు పని చేసే ఆఫీసు నుంచి గ్యారంటీ సర్టిఫికెట్టేనా తీసుకురమ్మని చెప్పాము"

ప్రకాష్‌కి నవ్వొచ్చింది... ఆమె ఆరోగ్యం గురించి అడిగితే తను డబ్బు గురించి మాట్లాడుతున్నాడు!

"మావారు పనిచేసేది ప్రైవేటు కంపెనీలో. వాళ్ళు అలాంటి సర్టిఫికెట్లివ్వరు. మేము తల తాకట్టు పెట్టయినా మీ బిల్లు కట్టేస్తాము. ఆలస్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం అని మీరే అంటున్నారు కదా? దయచేసి మా బాబుకి ఆపరేషన్ చేయండి. వాడి ప్రాణాలు కాపాడండి" అందామె ప్రాధేయపడుతున్నట్లుగా.

"ప్రయత్నిస్తానమ్మా... కానీ ఈ విషయంలో నేను నీకు హామీ ఇవ్వలేను. మీ పిల్లాడిని కాపాడడమన్నది నా చేతుల్లో ఏమీలేదు" అన్నాడు ప్రకాష్.

"అదేమిటండీ అలా అంటారు? మీరు డాక్టర్లు కాదా?" అందామె.

షాక్ తిన్నట్లు చూసాడు ప్రకాష్ ఆమె మాటలకి.

"మనం డాక్టర్లమన్న సంగతి. అంతకన్నా ముందు మనం మనుషులమన్న సంగతి కూడా మర్చిపోతున్నాం. ఒక మనిషి ప్రాణాలు కాపాడగలిగి ఉండి కూడా చేతులు ముడుచుకుని కూర్చుంటున్నాం. వైద్యాన్ని రోగి పరిస్థితిని బట్టికాకుండా స్థితిగతులని బట్టి చేస్తున్నాం.

సెక్యూరిటీ డిపాజిట్ కట్టలేని వారికి అవసరమైనా కూడా ఆపరేషన్ చేయం. కట్టగలిగిన వారికి అవసరం లేకపోయినా చేసేస్తాం!" ఆవేశంగా అన్నాడు ప్రకాష్ వేణుగోపాల్‌తో.

"కార్పోరేట్ హాస్పటల్లో ఉద్యోగం చేస్తూ ఇలాంటివన్నీ ఆలోచించడం గొంగట్లో తింటూ వెంట్రుకలేరుకోవడంలాంటిది. ముందీ కేసు గురించి చూడు" చిన్నగా నవ్వుతూ అన్నాడు వేణుగోపాల్ సాయంత్రం తాము సర్జరీ చేయబోయే పేషెంట్ తాలూకు యాంజియోగ్రామ్ రిపోర్టులు అతడికి చూపిస్తూ.

"నేను ఈ విషయం గురించి చీఫ్‌తో మాట్లాడతాను" అన్నాడూ ప్రకాష్.

"ఆయనేమంటాడు? అంతగా డబ్బు కట్టుకోలేకపోతే గవర్నమెంట్ హాస్పటల్లో వైద్యం చేయించుకోమంటాడు."

"డబ్బు కట్టగలడా లేదా అన్నది కాదు ప్రశ్న. ఇవాళ కాకపోతే రేపైనా సరే తలతాకట్టు పెట్టయినా డబ్బు తీసుకుని వచ్చి మనికిచ్చే తన కొడుకుని తీసుకు వెళతాడు. కానీ అత్యవసరమైన కేసులో కూడా సెక్యూరిటీ డిపాజిట్ కట్టలేదని ఆపరేషన్ వాయిదా వేయడం అమానుషం అంటాను"

వేణుగోపాల్ అతడివంక భావరహితంగా చూసాడు.

"కోట్లు పెట్టుబడి పెట్టి హాస్పటల్ కట్టి అందరికీ ఉచితంగా వైద్యం చేయమనడం లేదు నేను. కానీ పెట్టుబడి పెట్టాము కదాని కేవలం పెట్టుబడిదారుడిలానే ఆలోచించకూడదంటున్నాను. మనం ప్రాణాలు పోయిగల అద్భుతమైన శక్తి మనకే ఇచ్చాడా దేముడు. దాన్ని విస్మరించకూడదంటున్నాను. అలా విస్మరిస్తే కేవలం డబ్బిస్తేనే తమ శరీరాన్ని ఉపయోగించే మరో వృత్తిలోని వారికీ మనకీ తేడా లేదంటాను" అన్నాడు.

వింటున్న వేణుగోపాల్ ముఖం ఎర్రబడిందా మాటలకి.

ప్రకాష్ వంక వింతగా, ఒకింత అసహనంగా చూసాడు చీఫ్ మెడికల్ సూపరెండింటెంట్ సుదర్శనరావు. ఆయన వయసు యాభైకి పైనే ఉంటుంది. టేబుల్ మీద అప్పటిదాకా ఆయన చదివి పెట్టిన 'గురుచరిత్ర' పుస్తకంలోని కాగితాలు గాలికి చిన్నగా కదులుతున్నాయి.

"నువ్వు కొత్తగా ప్రాక్టీస్ మొదలు పెట్టావు కనుక నీకు తెలియదేమో కానీ, ఇలాంటి కేసులు ప్రతిరోజూ కొన్ని వందలు బయటపడుతూ ఉంటాయి. జనాభాలో కొన్ని లక్షల మంది పిల్లలు గుండెకి సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్నారు. వాళ్ళలో సగానికి పైగా నిరుపేదలే.

ఈ సమస్య నువ్వనుకుంటున్నంత చిన్నదేమీ కాదు. నువ్వొక్కడివే దీనిని పరిష్కరించేయలేవు." అన్నాడు సాధ్యమైనంత ప్రశాంతతని ముఖంలోకి తెచ్చుకుంటూ.

ఆయన కంఠంలో కదలాడిన వ్యంగ్యం ప్రకాష్ దృష్టిని దాటిపోలేదు.

"నేను మీరు చెబుతున్న సమస్య గురించి మాట్లాడటం లేదు. మన హాస్పటల్ లో జాయినైన వంశీ అనే పేషెంట్ గురించి మాట్లాడుతున్నాను" అన్నాడు.

ఆయన ఖంగుతిన్నట్లు చూసాడు ప్రకాష్ మాటలకి.

"ఎవరిదాకానో మనకెందుకు సార్... మన కళ్ళముందున్న చిన్న సమస్యకి స్పందించలేని మనకి దేశ సమస్యల్ని చర్చించడానికి అర్హతలేదు. మనం దేవుళ్ళమని నమ్మి, మనం తమ బిడ్డకి ప్రాణాలు పోస్తామన్న ఆశతో అతడిని మన హాస్పటల్లో చేర్పించారు ఆ దంపతులు. తీరా ఆపరేషన్ చేసేసాక బిల్లు కట్టలేరేమోనన్న కేవలం ఒక చిన్న అనుమానంతో సెక్యూరిటీ డిపాజిట్ కడితేకానీ ఆపరేషన్ చేయమని అతడి ప్రాణాలని రిస్కులో ఉంచడం డాక్టర్లగా మనం సిగ్గుపడాల్సిన విషయం అంటున్నాను"

ప్రకాష్ మాటలకి ఆయన ముఖం జేవురించింది. ఆయన ఆ హాస్పటల్లో చేరి పదేళ్ళవుతోంది. ఆ పదేళ్ళలోనూ ఎవ్వరూ ఆయన్ని అంతగా ఎదిరించి మాట్లాడింది లేదు. అదీ ప్రకాష్ లాంటి ఒక జూనియర్ డాక్టర్ అలా మాట్లాడ్డం ఆయనకి చాలా అవమానంగా అనిపించింది.

"చూడు ప్రకాష్.. నువ్వేదో ఆవేశంలో ఉండి మాట్లాడుతున్నట్లున్నావు. అది మన హాస్పటల్ రూల్. దానిని నువ్వూ నేనూ మార్చలేం. రూల్స్‌కి వ్యతిరేకంగా ఏ పని చేసినా నేను చాలామందికి సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది" అన్నాడాయన కోపంగా.

ప్రకాష్ కుర్చీలోంచి లేచాడు.

"మెడికల్ కాలేజీలో ఉండగా ఉద్యమాలు చేసిన వేడి నీలో ఇంకా చల్లారలేదల్లే ఉంది.

మొదటిసారి కనుక క్షమించి వదిలేస్తున్నాను. ఇంకోసారిలా జరిగితే నీ ఉద్యోగానికే ప్రమాదం. అనవసరంగా పేషెంట్లని రెచ్చగొట్టి నీ కెరీర్‌ని పాడుచేసుకోకు" అంటూ హెచ్చరించాడాయన.

అవమానభారంతో బయటికి నడిచాడు ప్రకాష్. అతడికి తండ్రి గుర్తుకు వచ్చాడు. తన చిన్నతనంలో తన నాన్నమ్మ వైద్యం సరిగా అందక మరణించింది. ఆ విషయాన్ని గుర్తు చేస్తూ తనని మెడిసిన్‌లో జాయిన్ చేసినపుడు అన్నాడు " ఆ సమయంలో సరైన వైద్యుడు అందుబాటులో ఉండివుంటే మీ నాన్నమ్మ బ్రతికుండేది. అప్పుడే నేను నిశ్చయించుకున్నాను. నిన్ను డాక్టర్ని చేయాలని. నువ్వు డాక్టరయ్యి ప్రాణాపాయ స్థితిలో ఉన్న పదిమంది ప్రాణాలు కాపాడాలని నా కోరిక!" అని.

ఇప్పుడు తనతోపాటు లెక్కలేనంతమంది డాక్టర్లున్నారు. అయినా ఏం చేయగలుగుతున్నారు?

"ఈ సమస్యని నువ్వొక్కడివే పరిష్కరించెయ్యలేవు" అన్న ఛీఫ్ మాటలు గుర్తుకు వచ్చాయి.

అంతేనా? తనేమీ చేయలేడా?

"మెడికల్ కాలేజీలో ఉద్యమాలు చేసిన వేడి ఇంకా నీలో చల్లారదేమో..." మళ్ళీ ఆయనన్న మాటలే గుర్తుకు వచ్చాయి. అంతే ... ఒక్కసారిగా ఏదో ఆలోచన వచ్చినట్లు ఉత్సాహంగా కదిలాడు ప్రకాష్.

జేబులోంచి సెల్ తీసి నెంబర్ డయల్ చేసాడు.

"హలో సాగరికా.... నేను ప్రకాష్‌ని. ఒక చిన్న సహాయం కావాలి. నీ క్లినిక్ ఒకరోజుకి... అహా... క్లినిక్ అంతా కాదు కేవలం ఆపరేషన్ థియేటర్ ఒకరోజుకి అద్దెకి కావాలి. థియేటర్ అద్దె, మెడిసన్స్ ఛార్జెస్ త్వరలోనే పే చేసేస్తారు. అందుకు పూచీ నాది... అలాగే నీ సహకారం కూడా కొంచెం కావాలి" అంటూ మాట్లాడాడు.

అలా మొదలు పెట్టి చాలా ఫోన్ కాల్స్ చేస్తూనే ఉన్నాడు. మెడికల్ కాలేజ్‌లో తనతోపాటు ఉద్యమాలు చేసిన వాళ్ళలో తనకి అవసరమైన చాలా మందికి...

అనస్థిషియన్ దగ్గరనుంచీ నర్సులూ ఆయాలదాకా ఆపరేషన్‌కి అవసరమైన అందరినీ సమకూర్చుకున్నాడు. చివరి ఫోన్ కాల్ మాట్లాడి అతడు కుర్చీలోంచి లేస్తుండగా అన్నాడు అటెండర్ యాదగిరి.

"ఒకరోజు సెలవు పెట్టి రేపు నేను కూడా మీతోపాటు వస్తాను సార్"

"ఎందుకు"? ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు ప్రకాష్.

"అక్కడ అటెండర్ అవసరమేమైనా ఉంటుందేమోనని... లేకపోతే ఆపరేషన్ అయిపోయాక కనీసం థియేటర్ శుభ్రం చేయడానికేనా పనికొస్తాను..."

విచిలితుడై చూసాడు ప్రకాష్ అతడి వంక. అతడి కళ్ళని సన్నటి పొరలా కన్నీళ్ళు కమ్మేసాయి.

సాగరిక క్లినిక్‌లో ప్రకాష్ పిలుపందుకుని వచ్చిన డాక్టర్ల ఆధ్వర్యంలో ఆపరేషన్ దిగ్విజయంగా ముగిసింది. వంశీ కోలుకున్నాడు. ఆ ఆపరేషన్‌కి పని చేసిన వాళ్ళలో డాక్టర్ వేణుగోపాల్ కూడా ఉన్నాడు.

"అద్భుతం. అసాధ్యమనుకున్నదానిని నీ పట్టుదలతో సుసాధ్యం చేసావు. అయితే ఒక్క విషయం. జీవితాన్ని కాచి వడబోసిన అనుభవంతో మన చీఫ్ చెప్పిన మాటల్లో కూడా నిజం లేకపోలేదు. ఇప్పుడంటే ఎలాగోలా ఈ గండాన్ని గట్టెక్కించావు. కానీ ఈ సమస్య నిజంగానే ఆయన చెప్పినట్లు చిన్నదేం కాదు. అందరూ నీలా ఆలోచించరు. అలా ఆలోచించే వాళ్ళు ఎక్కడో నూటికో కోటికో ఒక్కరుంటారు." అన్నాడు వేణుగోపాల్ ప్రకాష్‌తో.

ప్రకాష్ నవ్వేడు. "ఇప్పుడే చూసావుగా... చాలు... ఆ ఒక్కడూ చాలు. మిగిలిన వాళ్ళలోని జడత్వాన్ని వదిలించి, స్పందింప చేసి, సమీకరించి ముందుకు నడిపించడానికి ఆ ఒక్కడు చాలు!" అన్నాడు సంతృప్తి నిండిన కళ్ళతో.